క్లుప్తంగా

పేద కుటుంబానికి జ్ఞాన నిధి సేవా సంస్థ చేయూత


నగదు అందజేస్తున్న సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన శివ అనారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మీదేవితో నలుగురు కుమార్తెలు, కుమారుడు. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో జ్ఞాన నిధి సేవా సంస్థ సభ్యులు చేయూతనిచ్చారు. తమవంతుగా ఆదివారం రూ.52,500 అందజేశారు. పిల్లల పేరుమీద రూ. 40,500 ఫిక్సిడ్ డిపాజిట్ చేసి, ఖర్చుల నిమిత్తం లక్ష్మీదేవికి రూ. 11,500 అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఆనంద్, తిమ్మయ్య, శేషు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు కేంద్రాల్లో పది పరీక్షలు

కోవెలకుంట్ల: మండల కేంద్రం కోవెలకుంట్ల పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 220 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 140మంది, సెయింట్ జోసఫ్ పాఠశాల పరీక్షా కేంద్రంలో 220 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఆయా కేంద్రాలకు చీఫ్ సూపర్‌వైజర్లుగా హెచ్ఎంలు రామకృష్ణ, అరుణకుమారి, లలిత శ్యామలను నియమించారన్నారు. డిపార్ట్‌మెంటల్ అధికారులుగా సంజామల మండలం పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట, బనగానపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు కుమార్‌బాబు, యాగంటప్పను నియమించినట్లు పేర్కొన్నారు.

రేపు వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం గిద్దలూరు గ్రామ సమీపంలోని పంక్షన్ హాలులో సోమవారం మూడవ విడత వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 640 పొదుపు గ్రూపులకు రూ. 5.43 కోట్లు విడుదలయ్యాయన్నారు. 4వ తేదీన జరిగే ఉత్సవాలకు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని, పొదుపు మహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

108లో ప్రసవం


బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లీ,బిడ్డ

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామానికి చెందిన గర్భిణి వసంత ఆదివారం 108 వాహనంలోనే ఎదురు కాళ్లతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. గతంలో వైద్య పరీక్షలు చేయించుకోగా కడుపులో బిడ్డ ఎదురు కాళ్లతో ఉందని, సిజేరియన్ చేయాల్సి ఉంటుందని డాక్టర్లు సూచించారు. అయితే ఉన్నట్టుండి ప్రసవ నొప్పులు రావడంతో బంధువుల సమాచారం మేరకు 108 వాహనంతో వచ్చిన ఈఎంటీ జనార్ధన్ రెడ్డి, పైలెట్ రాముడు గర్భిణిని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తున్నారు. మార్గమధ్యంలో రాళ్లకొత్తూరు సమీపాన గర్భిణికి నొప్పులు అధికమయ్యాయి. ఈఎంటీ జనార్ధన్ అప్రమత్తంగా వ్యవహరించడంతో వసంత ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీ,బిడ్డను బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండటంతో బంధువులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో రొట్టె, గుడ్డు పంపిణీ


రొట్టె, గుడ్డు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు ప్రతి ఆదివారం చేపట్టే రొట్టె, గుడ్డు పంపిణీ కొనసాగింది. ఈ మేరకు కార్యక్రమాన్ని పరిశీలించిన ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ హనీఫ్ నిర్వాహకులను అభినందించారు. ఆశ్రమ నిర్వాహకులు జాన్‌ప్రభాకర్ మాట్లాడుతూ రాధాక్రిష్ణ బేకరి యజమాని ఆర్థిక సాయంయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

నేడు సీతారాముల కల్యాణం

బేతంచెర: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన సీతారాముల ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఉదయం సీతారామ, లక్ష్మణులకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగాహారతి అనంతరం 11:55 నిమిషాలకు అభిజిత్ లగ్నం శుభపుష్కారంశం నందు సీతారాముల కల్యాణం నిర్వహిస్తామన్నారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం!

డోన్ : రోజురోజుకూ విస్తరిస్తున్న డోన్ పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ప్రత్యేకించి ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. పిల్లలను స్కూళ్లలో వదిలేప్పుడు... తీసుకొని వచ్చేప్పుడు పడరానిపాట్లు పడుతున్నారు తల్లిదండ్రులు. ప్రధాన కూడళ్లలో ముందుకు వెళ్లలే... వెనక్కి రాలేం అన్నట్లుగా ఉంది పరిస్థితి. ప్రధాన రోడ్లు, యూటర్న్‌ల వద్ద అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపివేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను కొందరు వ్యాపారులు, దుకాణదారులు ఆక్రమిస్తున్నారు. తోపుడు బండ్లను రోడ్ల ఫుట్‌పాత్‌లపై పెట్టి దర్జాగా వ్యాపారాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఎస్‌బీఐ, సంత మార్కెట్, కొత్తబస్టాండ్, రైల్వేగేట్లు, బేతంచెర్ల, గుత్తి రోడ్డు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపైనే ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. మున్సిపల్, పోలీసు అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు చేస్తున్న ప్రయత్నాలు ఏ మాత్రం ఫలించడం లేదు. స్వయానా మున్సిపల్ చైర్మన్ అధికారులతో కలిసి పర్యటించి వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలిపితే భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించినా ప్రయోజనం శూన్యంగా మారింది. పార్కింగ్ స్థలాలు లేనందునే సమస్య తీవ్రమైందని మున్సిపల్, పోలీసు అధికారుల తీరును తప్పుపడుతున్నారు పట్టణ ప్రజలు. కనీసం ప్రధాన కూడళ్లలోనూ ట్రాఫిక్ నియంత్రణకు కనీసం ఓ హోంగార్డును కూడా నియమించడం లేదని పోలీసు అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు.


ఫుట్‌పాత్‌పై వ్యాపారం కొనసాగిస్తున్న దృశ్యం (ఫైల్)

ట్రాఫిక్‌ను నియంత్రిస్తాం

ట్రాఫిక్ సమస్యను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. రోడ్ల వెడల్పు కార్యక్రమంతో పాటు ప్రధాన కూడలిలో ఉన్న కూరగాయల మార్కెట్ నిర్మాణం పూర్తయిన వెంటనే ట్రాఫిక్‌ను పూర్తిస్థాయిలో క్రమబద్ధీకరిస్తాం అన్నారు. తోపుడుబండ్ల వ్యాపారులకు ప్రత్యేకంగా ప్లాట్‌ఫారం, ద్విచక్ర వాహనదారులకు పార్కింగ్ స్థలం ఏర్పాటుపై కూడా దృష్టి సారిస్తామని తెలిపారు.


పాతబస్టాండ్ యూటర్న్ వద్ద కారును నిలిపిన దృశ్యం (ఫైల్)


ఫుట్‌పాత్ కనిపించకుండా ఆక్రమించిన చిరు వ్యాపారులు (ఫైల్)


రోడ్డుపై తోపుడు బండి వ్యాపారం చేస్తున్న దృశ్యం (ఫైల్)

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన వివరించారు.

నేడు పింఛన్ల పంపిణీ

కొలిమిగుండ్ల: సూర్యోదయం కాక ముందే ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్లు లబ్ధిదారుల తలుపు తట్టి ఫించన్ నగదు అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆర్థిక సంవత్సరం ముగింపు, వరుసగా రెండు రోజులు బ్యాంక్‌లకు సెలవుల నేపథ్యంలో పింఛన్ల పంపిణీకి రెండు రోజులు బ్రేక్ పడింది. సోమవారం పింఛన్ల పంపిణీకి వలంటీర్లు సిద్ధమయ్యారు. మండలంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, చేనేత, ఒంటరి మహిళ, డప్పు, చర్మ కళాకారులకు సంబంధించి పింఛన్ లబ్ధిదారులు 7001 మంది ఉన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి

ప్యాపిలి: సచివాలయ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో ఆదివారం సచివాలయ కన్వీనర్లతో సమీక్ష నిర్వహించారు. జేసీఎస్ మండల కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ప్రజలకు జరిగిన మేలును వారికి అర్థమ్యేలా వివరించాలన్నారు. ఈ నెల 14 వరకు సచివాలయ కన్వీనర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు కలసి ఇంటింటికీ తిరగాలన్నారు. జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. యాజమాన్యాల అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లు అతికించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బోరెడ్డి పుల్లారెడ్డి, న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజా మురళీకృష్ణ, అంకిరెడ్డి, రామసుబ్బయ్య, కొండయ్య, శ్రీనివాసరెడ్డి, బోరెడ్డి రాము, బోరెడ్డి కృష్ణారెడ్డి, సోమశేఖర్, రామ్మూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన చల్లా శ్రీలక్ష్మి


నాగవర్ధన్‌రెడ్డిని పరామర్శిస్తున్న అవుకు జెడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి

ఉయ్యాలవాడ : ఉయ్యాలవాడ మండలంలోని రూపనగుడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల సోషల్ మీడియా కన్వీనర్ నాగవర్ధన్‌రెడ్డిని అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు, దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి సతీమణి చల్లా శ్రీలక్ష్మి పరామర్శించారు. ఇటీవల మోటార్ సైకిల్ ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం నాగవర్ధన్‌రెడ్డి ఇంటికి చేరుకోగా చల్లా శ్రీలక్ష్మి ఆదివారం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్న ఆమె అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆమె వెంట చల్లా చైతన్య రెడ్డి, చల్లా చరణ్‌కుమార్‌రెడ్డి, చల్లా విక్రాంత్‌రెడ్డి, చల్లా రాజ్యాభిషేక్‌రెడ్డి, జూనియర్ చల్లా రామక్రిష్టా రెడ్డి, శ్రీమన్నారాయణ, పల్లె శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీలదే రాజ్యాధికారం


మాట్లాడుతున్న బోడే రామచంద్రయ్య యాదవ్

డోన్ టౌన్ : బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బహుజనుల ఐకమత్యంతోనే భవిష్యత్‌లో బీసీ ముఖ్యమంత్రి పీఠం ఆధిరోహించనున్నారని బహుజన సమాఖ్య నాయకుడు బోడే రామచంద్రయాదవ్ అన్నారు. పట్టణానికి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో స్థానిక షాదిఖానాలో ఆదివారం ఏర్పాటు చేసిన బడుగు బలహీన వర్గాల చైతన్య వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ నుంచి షాదిఖానా వరకు ఆయన కాన్వాయ్‌తో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపిలో జనాభలో 56 శాతం ఉన్న బీసీలు ఓట్లు వేస్తే కేవలం రెండు, ఐదు శాతం ఉన్న కమ్మ,రెడ్డి సామాజిక వర్గాలు రాజ్యాధికారం అనుభవిస్తున్నారని ఆరోపించారు. త్వరలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం బీసీలు మాత్రమే పోటీ చేసే విధంగా తమ పార్టీ రూపకల్పన చేస్తుందని, త్వరలో పార్టీ జెండా,పేరు ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రామకృష్ణ, అయ్యన్న, రామచంద్ర, శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ప్రచారం చేయాలి
- రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు


మాట్లాడుతున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్ : పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు గుర్తు చేశారు. కుల మతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని, ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. స్థానిక సాయిశ్రీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమానికి ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌లు అధ్యక్షత వహించారు. సచివాలయ గృహ సారథులు, సచివాలయ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లను ఉద్దేశించి శ్రీరాములు ప్రసంగించారు. ప్రభుత్వం వైద్యం, విద్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని, నేరుగా సేవలు అందజేస్తుందని వివరించారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం లబ్ధి చేకూరిందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలును ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. పేదలందరికీ ఇంటి నివేశన స్థలం కేటాయించడంతోపాటు సొంతింటిని నిర్మించి ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని నాడు - నేడు పథకంతో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిద్దారని గుర్తు చేశారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రైతుభరోసా కేంద్రాలు నెలకొల్పి నేరుగా రైతులకు సేవలు అందజేస్తున్నారని వివరించారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అని, ఆ దిశగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్య పరచాలని గృహ సారథులు, సచివాలయ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లకు పిలుపునిచ్చారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సుమారు రూ. 2వేల కోట్లతో నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, పట్టణ గృహసారథుల కన్వీనర్ కురుకుంద హరి, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

బనగానపల్లెరూరల్: తిరుపతిలో ఈ నెల 16,17,18వ తేదీలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (ఐఎఫ్‌టీయు) ఆధ్వర్యంలో నిర్వహించే అఖిలభారత ఏడవ మహా సభలు విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయకులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని జూనియర్ ఎస్సీ బాలుర వసతి గృహంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ దేశంలో ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోడీ విధానాన్ని ఎండగట్టాలన్నారు. కార్మికుల హక్కులను కేంద్రం హరిస్తుందని, సాధనకు ఐకమత్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు రాజు, శివ, పార్థు, మధుకృష్ణ, శేషు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్లు బాధ్యతగా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చలం రెడ్డి

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ కన్వీనర్లపై ఉంచిన నమ్మకాని వమ్ము చేయకుండా బాధ్యతగా పనిచేయాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బాబుల్‌రెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు అజాంబాషా, తిరుమలేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మీ పరిధిలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. పిలుపునిచ్చారు.

మిగులు భూములు కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న వీఆర్ రామిరెడ్డి

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లె పరిసర ప్రాంతాల్లో 250 ఎకరాలకు పైగానే ఉన్న మిగులు భూములను రాంకో సిమెంట్ కంపెనీ కొనుగోలు చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీఆర్ రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కనకాద్రిపల్లెలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007-08 సంవత్సరాల మధ్య కంపెనీ ఆరు గ్రామాల్లో సుమారు 4750 ఎకరాల్లో సున్నపురాయి ఉన్న భూములపై మైనింగ్ లీజు తెచ్చుకుందన్నారు. గతంలోనే 250 ఎకరాలు కొనుగోలు చేస్తామని ఎన్విరాల్‌మెంట్ క్లియరెన్స్ తెచ్చుకున్నా ఇప్పటి వరకు చేయలేదన్నారు. కనకాద్రిపల్లె-ఇటిక్యాల గ్రామాల సమీపంలో ప్రభుత్వ అనుమతి లేకుండా మైనింగ్ ప్రాంతంలోకి వెళ్లేందుకు రోడ్డు నిర్మించుకొని చెరువు అలుగు భాగాన్ని అన్యాక్రాంతం చేశారన్నారు. ఈవిషయంపై ఇటీవలనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరినా యాజమాన్యం పట్టించుకోకుండా స్థానికేతరులకు ఇచ్చారని ఆరోపించారు. కంపెనీ సామాజిక బాధ్యతను విస్మరించిందని, సమస్యలు పరిష్కరించకపోతే భూములు కోల్పోయిన బాధిత కుటుంబాలతో కలిసి న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్ విజయ్‌సింహారెడ్డి, సర్పంచ్ రామలక్ష్మన్న, ఎంపీటీసీ సభ్యుడు పెద్దన్న, జీసీ వెంకట్రాముడు, మద్దిలేటి, రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఓబులేసు, నాగప్ప, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

జోరుగా... ఐపీఎల్ బెట్టింగ్!

కొలిమిగుండ్ల: వినోదం కోసం నిర్వహించే క్రికెట్ పోటీలు కొంత మంది జూదరులకు కల్పతరువుగా మారింది. గతంలో క్రికెట్ మ్యాచ్ అంటే అందరూ ఒక చోట కూర్చుని సరదాగా తిలకించేవాళ్లు. కాలక్రమేనా టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో స్మార్ట్ ఫోన్లలోనే వీక్షిస్తున్నారు. మార్చి 31నుంచి ఐపీఎల్ టీ20 క్రికెట్ 16వ సీజన్ మొదలైంది. ఒకప్పుడు పట్టణాలకు పరిమితమైన క్రికెట్ బెట్టింగ్ పల్లెలకు పాకింది. వందలతో మొదలైన బెట్టింగ్ వేలు... చివరకు లక్షల్లో జరుగుతుంది. సాయంత్రం కాగానే కొలిమిగుండ్లతో పాటు పలు గ్రామాల్లో యువకులు ఫోన్లలో ఏటీం గెలుస్తుందని... వాటిపై చర్చించుకొని రేటింగ్ ఇచ్చుకుంటారు. తర్వాత స్మార్ట్ ఫోన్‌లోనే ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా నగదు జమ చేసుకుంటు బెట్టింగ్ కాస్తున్నారు. ఎక్కువ భాగం యువత పాల్గొంటున్నారు. చివరకు పదో తరగతి చదివే విద్యార్థులు సైతం బెట్టింగ్ మోజులో పడుతున్నారు. కొలిమిగుండ్ల మండలంలో యువత, విద్యార్థులతో పాటు సాధారణ కూలీ పనులు చేసుకునే కార్మికులు సైతం బెట్టింగ్ మాయాజాలంలో చిక్కుకున్నారు. మ్యాచ్ గెలుపు ఓటములే కాకుండా ఏ ఓవర్‌లో ఎన్ని పరుగులు వస్తాయి..ఏబాల్ సిక్స్ కొడతారు... అనే విషయాలపై కూడా బెట్టింగ్ కాస్తున్నారు. భారీగా నష్టపోతున్నారు. ఈతతంగా మంతా సెల్‌ఫోన్లలోనే జరుగుతుంది.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


నగదు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల : పట్టణ సమీపాన వెలసిన చౌడేశ్వరీ దేవి తిరునాలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక శేషారెడ్డి హైస్కూలు మైదానంలో నిర్వహించిన పాలపండ్లలోపు రాష్ట్రస్థాయి చిన్నసైజు బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎనిమిది జతల వృషభాలు పాల్గొన్న పోటీలను చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ సభ్యుడు గౌరి హుస్సేన్‌రెడ్డి ప్రారంభించారు. పాణ్యం మండలం ఎస్ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర్‌రెడ్డి వృషభాలు ప్రథమ, నంద్యాల మండలం గుడిపాడు వెంకటరామిరెడ్డి ద్వితీయ, తెలంగాణా రాష్ట్రం, నాగర్ కర్నూల్ అరన్య రెడ్డి మూడవ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా నాల్గవ స్థానంలో నంద్యాల మండలం చిన్నకానాల చెన్నారెడ్డి వృషభాలు, ఐదవ స్థానంలో తెలంగాణా రాష్ట్రం నాగర్ కర్నూలు అరన్యరెడ్డి వృషభాలు, ఆరవ స్థానంలో బేతంచెర్ల మండలం బలపాలపల్లె ఎం. సురేష్ వృషభాలు నిలిచాయి. విజేత వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ.50 వేలు, రూ 40 వేలు, రూ. 30 వేలు, రూ20 వేలు రూ.10 వేలు రూ, 2,500 అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రఘురామిరెడ్డి, మల్లు సుబ్బారెడ్డి, రామాంజనేయులు, రామస్వామి, అన్నారావు, అజయ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


బాబుల్ రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సమన్యాయం పాలన అమలుజేస్తూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు బాబుల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ముద్దవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మీనిగ మద్దిలేటిస్వామి, మనీష్ నాయుడు, బలిమి శేఖర్, రవికుమార్, అంబాపురం రాజ శేఖర్, కోటిరెడ్డి, రమేష్, పిక్కిలి రమేష్, మిట్టమీది రంగయ్య, పిక్కిలి హరి తదితరులు బాబుల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం పాలన సాగిస్తున్నారన్నారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ నాయకులు బుగ్గానిపల్లె మధు, సూర్య బళ్లాని పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల పండుగ


మట్టలతో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు


ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు


ఈత మట్టలతో ప్రదర్శన చేస్తున్న మహిళలు


మట్టల ప్రదర్శనలో పాల్గొన్న క్రైస్తవులు

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కోవెలకుంట్ల- నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలోని రోమన్‌కాథలిక్ మిషన్ చర్చి(ఆర్‌సీఎం), చర్చి ఆఫ్ సౌత్ ఇండియన్(సీఎస్ఐ) చర్చిలతోపాటు గ్రామాల్లో క్రైస్తవులు ఈత మట్టలు పట్టుకుని ఆయా చర్చిల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఏసుక్రీస్తు ఏరుసలెంలో ప్రవేశానికి క్రైస్తవులు మట్టలతో స్వాగతం పలికినందుకు గుర్తుగా ఈస్టర్ పండుగకు ముందు వారం మట్టల ఆదివారాన్ని చేపడుతారు. అనంతరం ఆయా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఫాదర్లు ప్రకాష్‌బాబు, వినయ్‌కుమార్, లూర్దయ్య, కిషోర్, ఆయా చర్చిల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో ఆదివారం మట్టల పండగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ మేరకు ఉదయం ఆయా చర్చిల్లో ప్రత్యేక ఆరాధన చేశారు. సీఎస్ఐ చర్చి ఫాదర్ రెవరెండ్ ఆల్బర్ట్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఈత మట్టలను చేత పట్టుకొని ప్రార్థన గీతాలు పడుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ఉపవాస దినాల్లో మట్టలాదివారం ప్రాముఖ్యతను ఫాదర్ ఆల్బర్ట్ వివరించారు.

డోన్ : మండల కేంద్రం డోన్‌తోపాటు గ్రామాల్లో ఆదివారం మట్టల పండుగ భక్తిశ్రద్ధతో నిర్వహించారు. స్థానిక వైఎస్ఆర్ నగర్ నుండి బైబిల్ మిషన్ రాయలసీమ కన్వీనర్ రెవరెండ్ బందెల రాజు ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టలను చేతపట్టి పట్టణంలోని ప్రధాన రహదారిలో క్రీస్తు గీతాలను ఆలపిస్తూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్లు మణి రాజు, దేవవరంతో పాటు పెద్దసంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల కేంద్రం ప్యాపిలితోపాటు గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక బైబిల్ మిషన్ మరనాత చర్చిలో రెవరెండ్ ఏఓ బందెల రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులు మట్టలు చేతపట్టుకుని ప్రభువైన ఏసును స్తుతించారు. ప్రపంచ శాంతి కోసం ఏసు క్రీస్తు గాడిద మీద కూర్చొని యెరూసలేములోకి ప్రవేశించారని రెవరెండ్ బందెల రాజు తెలిపారు.

కొలిమిగుండ్ల: ఈస్టర్ పండుగ సందర్భంగా మట్టల ఆదివారం వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ఈత మట్టలతో క్రైస్తవులు ప్రదర్శన చేశారు. అలాగే హోసన్నా మందిరం, బేతనియ మందిరం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.